నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శుక్రవారం 26 ఏప్రిల్ 2024 YADADRI BHUVANAGIRI

# దద్దరిల్లిన భువనగిరి

- కేసీఆర్ రోడ్ షో సూపర్ సక్సెస్
- భారీ ర్యాలీతో ఘన స్వాగతం
- దారి పొడవునా బీఆర్ఎస్ బాస్‌కు పూల వర్షం
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- జనసంద్రంగా మారిన వినాయక చౌరస్తా
- దిక్కులు పిక్కటిల్లేలా జన హోరు.. కేరింతల జోరు
- గులాబీమయమైన భువనగిరి పట్టణం

## అద్భుతంగా యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం..

రెండు జాతీయ పార్టీలు దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని కేసీఆర్ మండిపడ్డారు. ఒక పార్టీ దేవుడి పేరుతో ఓట్లు దండుకుంటుంటే.. మరో పార్టీ దేవుడిపై ఒట్లు వేస్తూ కాలం గడుపుతున్నదని విమర్శించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించామని, ఏనాడైనా ఓట్ల కోసం వాడుకున్నామా అని నిలదీశారు. ఇది వాళ్లకు, మనకు మధ్య ఉన్న తేడా అని స్పష్టం చేశా రు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని, ఇందుకు భువనగిరి రాజకీయాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఆ రెండు పార్టీలు కలిసి భువనగిరి మున్సిపల్ చైర్మన్‌ను దించాయని, చైర్మన్ పదవి కాంగ్రెస్, వైస్ చైర్మన్ పదవిని బీజేపీ పంచుకున్నాయని, ఎవరు కుమ్మక్కో ఇప్పుడైనా తెలుస్తుందా అని ప్రశ్నించారు.





భువనగిరి రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం, నమస్కరిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**భువనగిరి గులాబీ వనమైంది. బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు అండగా ఉంటామంటూ దండు కదిలింది. నెత్తిన టోపీ, చేతిలో జెండాలతో బీఆర్ఎస్ శ్రేణులు కదనోత్సాహంతో కదిలివచ్చాయి. జనం తండోపతండాలుగా తరలిరావడం ప్రతిపక్షాల్లో గుబులు పుట్టించింది. బీఆర్ఎస్‌కు కంచుకోటగా పేరున్న భువనగిరిలో కేసీఆర్ సభ గులాబీ దండుకు వెయ్యేనుగుల బలాన్నిచ్చింది. గులాబీ బాస్ ప్రసంగించినంత సేపు.. ఆసాంతం ఈలలు, చప్పట్ల హోరు సభలో మార్మోగింది.**

*– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ)*

కేసీఆర్ బస్సు యాత్రలో గురువారం భాగంగా రెండో రోజు కొనసాగింది. సాయంత్రం సూర్యాపేట నుంచి ప్రారంభమై తిరుమలగిరి మీదుగా బయల్దేరారు. అటు నుంచి జనగాం వెళ్లి అనంతరం ఆలేరు బైపాస్ మీదుగా భువనగిరికి చేరుకున్నారు. బస్సు యాత్రం సందర్భంగా దారిపొడవునా కేసీఆర్‌కు జనం నీరాజనం పలికారు. ఆయన్ని చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా జనం ఎగబడ్డారు. కేసీఆర్ బస్సుతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి కనబరిచారు. రాత్రి రాయగిరి రోడ్డు నుంచి భువనగిరి పట్టణంలోని పాత బస్టాండ్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా వినాయక చౌరస్తా వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు వెంట కిలో మీటరు మేర బస్సు యాత్రకు మహిళలు పూల వర్షం కురిపించారు. బస్సులో నుంచే కేసీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

### వినాయక చౌరస్తా జనసంద్రం..

కేసీఆర్ రోడ్ షో సూపర్ సక్సెస్ అయ్యింది. జనం ప్రభంజనంలా వెల్లువెత్తారు. వినాయక చౌరస్తా జన సంద్రమైంది. నియోజకవర్గంలోని దారులన్నీ భువనగిరిలోని కేసీఆర్ సభ వైపే నడిచాయి. వేలాది మంది జనం స్వచ్ఛందంగా తరలివచ్చారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లతో కదిలివచ్చారు. అంచనాలకు మించి ప్రజలు రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. సభ ఆసాంతం జై తెలంగాణ, జై కేసీఆర్, కేసీఆర్ సీఎం నినాదాలతో దద్దరిల్లిపోయింది. కేసీఆర్ సభ నేపథ్యంలో భువనగిరి గులాబీమయంగా మారింది. పట్టణమంతా కటౌట్లు, ఫ్లెక్సీలు, జెండాలతో నిండింది. బైక్ ర్యాలీలతో యువత ముందుకు కదిలారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కండ్లను కట్టేలా మహిళలు బతుకమ్మలు, కోలాటాలు తరలివచ్చారు. ఒగ్గుడోలు, కొమ్ముడోలు కళాకారులు సంప్రదాయ కళా రూపాలతో మెప్పించారు. గిరిజనులు తమ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. మండే ఎండలను లెక్క చేయకుండా సాయంత్రం నాలుగు గంటలకే జనం స్వచ్ఛందంగా తరలివచ్చారు. సభలో అన్ని ప్రాంతాల్లో మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

### ఉరకలెత్తిన అభిమానం..

భువనగిరికి కేసీఆర్ వస్తున్నారని తెలియడంతో అన్ని వర్గాల ప్రజల ఉరకలెత్తే ఉత్సాహంతో తరలివచ్చారు. చిన్నా, పెద్దా, యువత, అంతా కదం తొక్కారు. మహిళలు చిన్న పిల్లలను ఎత్తుకుని రావడం కనిపించింది. చేతిలో కర్రలు, మెడలో కండువా కప్పుకొని ముసలోళ్లు అడుగులో అడుగేసుకుంటూ వచ్చారు. ఇక యువత, విద్యార్థులు సైతం కేసీఆర్ ప్రసంగాన్ని, ఫొటోలను ఆసక్తిగా సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. భూదాన్‌పోచంపల్లికి చెందిన వృద్ధురాలు కర్నాటి లక్ష్మమ్మతో మాట్లాడగా.. 'కేసీఆర్ పార్టీ పెట్టినప్పటి నుంచి అభిమానిని. రేవంత్‌రెడ్డి బ్రోకర్. ఆ దగుల్బాజీ వచ్చి అంతా ఆగం చేస్తున్నడు. నేతన్నలకు నెలనెలా పైసలేసుడు బంద్ చేసిండు. పథకాలన్నీ ఆపిండు' అని బదులిచ్చింది. భువనగిరికి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి బాలాచారిని పలుకరించగా.. 'పదేండ్ల క్రితం వరకు ఎన్నో ఏండ్లు గోస పడ్డాం.. బాధలు అనుభవించాం. అవన్నీ తెలుసు. మూడు నెలల కిందటి వరకు కూడా ఎట్లుందో తెలుసు. కానీ మళ్లీ మూడు నెలల నుంచి పరిస్థితి మారింది. నీళ్లు, కరెంట్ కష్టాలు వచ్చినయ్. ఇంది రమ్మ రాజ్యమంటే బిందెలు పట్టుకొని రోడ్లమీదకు రావడమా?' అని నిలదీయడం కనిపించింది. పిల్లాడిని భుజానెత్తుకొని.. భార్య, మరో పిల్లాడితో కలిసొచ్చిన ఎండీ షఫీర్‌ను కదలించగా.. 'కేసీఆర్ అంటే మస్తు అభిమానం. ఆయన కోసం కుటుంబం సహా వచ్చినం. మళ్లీ ఆయన పాలనే రావాలి' అని చెప్పుకొచ్చారు.

### దిక్కులు పిక్కటిల్లేలా..

బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ ప్రసంగిస్తున్నంత సేపూ వినాయక చౌరస్తా దద్దరిల్లిపోయింది. దిక్కులు పిక్కటిల్లేలా జన హోరు కొనసాగింది. కేసీఆర్ మాట్లాడే సమయంలో బీఆర్ఎస్ శ్రేణుల ఈలలు, చప్పట్లు, కేరింతలతో మార్మోగింది. గులాబీ బాస్ ప్రసంగం ప్రారంభిస్తూ.. 'గౌరవనీయులైన' అనడంతోనే పెద్దఎత్తున ఈలలు, చప్పట్లు, కేరింతలతో వినాయక చౌరస్తా మార్మోగింది. దీంతో 'కొద్ది సేపు.. ప్లీజ్.. తమ్ముడూ ప్లీజ్'' అని కేసీఆర్ అనడంతో కాస్త శాంతించారు. ప్రసంగం సమయంలో కేసీఆర్ ప్రశ్నలు సంధిస్తూ ప్రజలను మమేకం చేశారు. 'బీజేపీతో రాష్ట్రానికి ఏమన్నా జరిగిందా..?' అని అనగానే జరగలేదంటూ పెద్దఎత్తుగా కేరింతలు కొట్టారు. బేటీ పడావో.. బేటీ బచావో అంటున్నది.. బేటీ పడాయించిందా..? బేటీ బచాయించిందా..? అనడంతో ఫుల్ జోష్ నెలకొంది. రైతుబంధు అందరికి వచ్చిందా..? అని ప్రశ్నించగానే.. రాలేదని, అధికారం మారగానే కట్క ఒత్తినట్లు కరెంట్ పోతదా..? తొమ్మిదేండ్లు కరెంట్ మంచిగానే వచ్చిందిగ.. ఇప్పుడెందుకు పోతది..? వీళ్లను ఏమనాలి.. దద్దమ్మలు కాదా..? అని అనడతో ఒక్కసారి చౌరస్తా హోరెత్తింది.

### సునీతక్క పాట.. కిశోరన్న ఆట

రోడ్డు షో సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాంగ్రెస్ మోసాలు, గతంలో బీఆర్ఎస్ చేపట్టిన పలు సంక్షేమ పథకాలపై కళాకారులు పాటలు పాడుతూ అలరింపజేశారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి కళాకారులతో కలిసి పాట పాడారు. భద్రాచలం సినిమాలోని 'ఒకటే జననం.. ఒకటే మరణం' పాటను అందుకుని శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. అదే విధంగా తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ సైతం కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. డప్పు చప్పుళ్లకు డ్యాన్స్ చేస్తూ ఉత్సాహం నింపారు.



భువనగిరి రోడ్ షోలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పక్కన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

## పదేండ్లు వెనక్కి తీసుకెళ్లిన కాంగ్రెస్ సర్కారు

- రోడ్‌షోలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ తెచ్చుడో అని చావునోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ర్టాన్ని సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. 2001లో తెలంగాణ రాష్ట్రం సాధించడమే లక్ష్యంగా పార్టీని ఏర్పాటు చేసి, 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేశారని తెలిపారు. భువనగిరిలో మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెచ్చిన తెలంగాణను సుభిక్షంగా ఉంచాలని, ప్రజలకు ఏ ఇబ్బంది కూడా లేకుండా పదేండ్ల పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు నాలుగు నెలల్లోనే మళ్లీ పదేండ్ల వెనక్కి తీసుకెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజలు నీళ్లు, కరెంట్ లేక చాలా కష్టాలు పడుతున్నారని, పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతున్నారని చెప్పారు. కండ్ల ముందు ప్రజలు ఇబ్బంది పడుతుంటే చూడలేక కేసీఆర్ జనం మధ్యకు వచ్చారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతోనే ఇది సాధ్యమైతుందని, క్యామ మల్లేశ్‌ను ఆదరించాలని కోరారు.

# క్యామ మల్లేశ్‌ను బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలి

## విద్యావంతుడు, పట్టుదల, నిజాయితీ గల వ్యక్తి

- గెలిస్తే 24గంటలు పనిచేసే నాయకుడు.. అభివృద్ధి చేస్తారు..
- ఓ పార్టీది దేవుడి పేరుతో ఓట్లు.. మరో పార్టీది దేవుడిపై ఒట్లు
- యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించాం
- మనం ఏనాడైనా ఓట్ల కోసం వాడుకున్నామా..?
- కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే.. భువనగిరి చైర్మన్‌ను దింపిండ్రు.
- కాంగ్రెస్ చైర్మన్, బీజేపీ వైస్ చైర్మన్‌ను పంచుకుండ్రు..
- బస్వాపూర్ ప్రాజెక్టును నిర్మించుకున్నాం..
- ఆలేరు, భువనగిరి సమస్యశ్యామలం అవుతుంది
- పైళ్ల శేఖర్ రెడ్డి కొట్లాడి ఎయిమ్స్ తెచ్చిండు
- భువనగిరిలో రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : 'క్యామ మల్లేశ్ బడుగు బలహీన వర్గాల వ్యక్తి. మంచి మనిషి.. పట్టుదల, నిజాయితీ ఉన్న వ్యక్తి. గెలిస్తే 24గంటలు పనిచేసే నాయకుడు. అభివృద్ధి చేస్తారు. ఆస్తిపాస్తులు ఉన్నోడు. డబ్బుల కోసం పాకులాడేటోడు కాదు. చదువుకున్న విద్యావంతుడు. తలలో నాలుకలా ఉండే వ్యక్తి. మల్లేశ్‌ను బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలి' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణంలో గురువారం నిర్వహించిన రోడ్‌షోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని, మన హక్కులను మనం సాధించుకోవాలని చెప్పారు. భువనగిరి చూపిస్తున్న ఉత్సాహాన్ని ఏడు నియోజకవర్గాల్లో చూపించాలని కోరారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయాలంటే బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాలన్నారు.

### శేఖర్ రెడ్డి కొట్లాడి ఎయిమ్స్ తెచ్చిండు

గురుకులాల్లో అన్నం తిని వందల మంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, భువనగిరిలో ఓ అబ్బాయి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సంక్షేమ కోసం తెచ్చిన పథకాలన్నీ రద్దు చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రిపై ఒట్టేసి చెబుతున్నారని, కానీ చేయడంలేదని, ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి కొట్లాడి ఎయిమ్స్‌ను తీసుకొచ్చారని గుర్తు చేశారు. బూర నర్సయ్య గౌడ్ నాడు ఎంపీగా ఉన్నా ఏం చేయలేదని, మళ్లీ ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ఓట్లడగటానికి వస్తున్నారని ప్రశ్నించారు. భువనగిరి, ఆలేరు, జనగాంలో నీటి కోసం ఎంతో గోస ఉండేదని, ట్యాంకర్లు, బిందెలతో నీళ్లు పట్టుకునేదని గుర్తు చేశారు. ఈ కష్టాలన్నీ పోగొట్టి అనేక విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేశామని, దీని ద్వారా భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, ఉమామాధవరెడ్డి, మాజీ ఎంపీలు జోగినిపల్లి సంతోష్ రావు, బడుగుల లింగయ్యయాదవ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వరరెడ్డి, తొట్ల స్వామి, ఒంటెద్దు నరసింహారెడ్డి, సుదగాని హరిశంకర్ గౌడ్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి రోడ్ షోలో ప్రజలు, కళాకారులతో కలిసి నడుస్తున్న మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్, బీఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

# అడుగడుగునా నీరాజనం

## సూర్యాపేట నుంచి భువనగిరి వరకు ప్రజల ఘన స్వాగతం

సూర్యాపేట, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర గురువారం సూర్యాపేట నుంచి బయల్దేరింది. సాయంత్రం 3.50 గంటలకు అర్వపల్లి, నాగారం, తిరుమలగిరి, జనగాం, ఆలేరు మీదుగా కేసీఆర్ భువనగిరికి వెళ్లగా జనం నీరాజనం పలికారు. దారిపొడవునా రైతులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలతోపాటు పార్టీ శ్రేణులు కేసీఆర్ కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు. చేతులు ఊపి స్వాగతించారు. కేసీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

### అభిమానులతో ఆప్యాయంగా..

బుధవారం సాయంత్రం మిర్యాలగూడ రోడ్ షో అనంతరం సూర్యాపేటకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ పట్టణంలో రోడ్ షోలో పాల్గొన్నారు. రాత్రి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి క్యాంప్ ఆఫీసుకు చేరుకొని బస చేశారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల వరకు క్యాంప్ ఆఫీసులోనే ఉన్న కేసీఆర్ దాదాపు గంటపాటు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులతో కరచాలనం చేస్తూ అందరితో ఫొటోలు దిగారు. ఇక్కడ కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, రవీంద్రకుమార్, భాస్కర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ దీపికాయుగంధర్ రావు, సూర్యాపేట, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్స్ పెరుమాళ్ల అన్నపూర్ణ, సామినేని ప్రమీలారమేశ్ తదితరులు ఉన్నారు.



అర్వపల్లిలో పూలు చల్లి కేసీఆర్ బస్సుకు స్వాగతం పలుకుతున్న మహిళలు